


# ఇండిగో ఆర్డర్

న్యూఢిల్లీ, జూన్ 19: దేశీయ విమానయాన రంగంలో మార్కెట్ లీడర్ అయిన ఇండిగో రికార్డుస్థాయిలో 500 ఎయిర్‌బస్ ఏ320 విమానాలకు ఆర్డరు చేసింది. టాటా గ్రూప్ నుంచి పోటీ ఏర్పడనున్న నేపథ్యంలో భారీ విస్తరణకు ఇండిగో నడుంకట్టింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌బస్‌కు ఇప్పటివరకూ ఏ ఎయిర్‌లైన్ కొనుగోలు చేయనంత భారీ ఆర్డరు ఇచ్చినట్టు ఇండిగో సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2023 ఏప్రిల్‌నాటికి దేశీయ మార్కెట్లో ఈ సంస్థకు 57.5 శాతం వాటా ఉంది. ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల డెలివరీ 2030 నుంచి 2035 మధ్యలో ఉంటాయని అంచనా వేస్తున్నట్టు ఇండిగో వెల్లడించింది. ఈ ఆర్డర్ అధికారిక విలువ 55 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.4.50 లక్షల కోట్లు) కాగా, వాస్తవ విక్రయ ధర సాధారణంగా ఇంతకంటే తక్కువ ఉంటుంది. వాస్తవ ధర ఎంతన్నదీ వెల్లడికాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత భారత్ నుంచి విమాన తయారీ సంస్థలకు వెళ్లిన రెండో పెద్ద డీల్ ఇది. ఫిబ్రవరిలో టాటా కంపెనీ ఎయిర్ ఇండియా ఎయిర్‌బస్, బోయింగ్‌లకు 470 విమానాల తయారీ ఆర్డర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆర్డరు విలువ 80 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.6.55 లక్షల కోట్లు). అంతర్జాతీయంగా అతిపెద్ద విమాన తయారీ కంపెనీలైన బోయింగ్ యూఎస్ కంపెనీకాగా, ఎయిర్‌బస్ ఫ్రాన్స్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

# బీవోబీ@ రూ.లక్ష కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 19: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లకు చేరుకున్నది. పీఎస్‌యూ బ్యాంక్‌ల్లో ఈ మార్క్‌ను చేరుకున్న రెండవదిగా నిలిచింది. దేశంలో అతిపెద్దదైన స్టేట్ బ్యాంక్ ఇండియా (ఎస్బీఐ) రూ.1 లక్ష కోట్ల మార్క్ మార్కెట్ విలువను దాటిన తొలి బ్యాంక్. ప్రస్తుతం ఎస్బీఐ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.08 లక్షల కోట్లు. సోమవారం బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతం మేర పెరిగి రూ.193.75 వద్ద నిలిచింది. ఇది నెలరోజుల్లో 7 శాతంపైగా ర్యాలీ జరిపింది. మార్చితో ముగిసిన నాల్గవ త్రైమాసికంలో బీవోబీ నికరలాభం 168 శాతం వృద్ధితో రూ. 4,775 కోట్లకు చేరగా, నికర వడ్డీ ఆదాయం 34 శాతం పెరిగి రూ. 11,525 కోట్ల వద్ద నిలిచింది. అలాగే బ్యాంక్ స్థూల ఎన్‌పీఏలు సగం వరకూ తగ్గాయి.

# ఎన్‌ఎస్ ఏవియేషన్ చేతికి ట్రూజెట్

హైదరాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ బిజినెస్): ఆర్థిక ఇబ్బందులతో గతేడాది మార్చిలో మూతపడిన ప్రాంతీయ విమాన సేవల సంస్థ ట్రూజెట్ మళ్లీ టెకాఫ్ అవడానికి సిద్ధమవుతున్నది. అమెరికాకు చెందిన ఎన్‌ఎస్ ఏవియేషన్ తాజాగా భారత్‌లో విమాన సేవలు అందించేందుకుగాను ట్రూజెట్‌లో మెజార్టీ వాటాను కొనుగోలు చేసింది. రూ.450 కోట్ల విలువైన ట్రూజెట్‌లో 85 శాతం వాటాను హస్తగతం చేసుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఉమేశ్ మాట్లాడుతూ..ట్రూజెట్‌లో ఎన్‌ఎస్ ఏవియేషన్ మెజార్టీ వాటాను కొనుగోలు చేసిందని, దీంతో త్వరలో విమాన సేవలు తిరిగి ప్రారంభించబోతున్నట్టు ప్రకటించారు.



# సర్కారీ సంస్థల గోస



## కేంద్రం తీరుతో ప్రశ్నార్థకంగా ప్రభుత్వ రంగ సంస్థల ఉనికి

ఓవైపు నష్టాల సాకుతో ప్రైవేటీకరణ..మరోవైపు లాభాల పేరుతో డివిడెండ్లు దండుకుంటున్న వైనం

**ఖజానాకు చేరుతున్నది రూ.63వేల కోట్లపైనే**

మోదీ సర్కారు ప్రైవేట్ కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నదన్న విమర్శలు

***దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయా?***

***నష్టాల సాకుతో ప్రైవేటీకరిస్తూ.. లాభాల పేరుతో డివిడెండ్లు తీసుకుంటూ జాతి సంపదను కార్పొరేట్లపరం చేసే పన్నాగాలు పన్నుతున్నారా??***

***కేంద్రంలోని నేటి పాలకుల అడ్డగోలు విధానాలు.. ఎందరో మేధావుల సంకల్పంతో స్థిరపడ్డ సర్కారీ కంపెనీల పునాదుల్ని పెకిలిస్తున్నాయన్న విమర్శలు అంతటా వినిపిస్తున్నాయిప్పుడు.***

కుదిరితే అమ్ముకోవడం.. లేకపోతే దండుకోవడం.. ఇదీ కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు సంగతి. దేశంలోని ఎన్నో ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థల ఉనికి ఇప్పుడు ప్రమాదంలో పడింది. ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ కార్పొరేట్ల అడుగులకు మడుగులు ఒత్తుతున్న పాలకపక్షం.. అడ్డగోలు విధానాలతో జాతి సంపదను దోచేస్తున్నది. ఇప్పటికే ఎయిర్ ఇండియాను అమ్మేయగా.. మరికొన్ని కంపెనీలనూ అదే బాటలోకి తెస్తున్నది.

**ప్రమాదంలో 60 కంపెనీలు**

దాదాపు 60 ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లను వీలుంటే అమ్మడమో.. లేకుంటే మూసేయడమో చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇవన్నీ ఎరువులు, టెక్స్‌టైల్స్, రసాయనాలు, పెట్రోకెమికల్స్, ఔషధ, వాణిజ్య రంగాలకు చెందినవే. ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి మోదీ సర్కారు ఓ కొత్త విధానం తెచ్చింది. ఇందులో భాగంగానే వ్యూహాత్మకేతర రంగంలోని పీఎస్‌యూలను అమ్మడం లేదా మూసేయాలని చూస్తున్నది. దేశీయ వ్యూహాత్మకేతర రంగంలో సుమారు 175 పీఎస్‌యూలున్నాయి. వీటిలో 60 సంస్థలను గుర్తించి వాటిని వీలైనంత త్వరలో ప్రైవేట్ కంపెనీలకు విక్రయించాలని, అలా జరుగనిపక్షంలో మూసేయాలని కేంద్రం తీర్మానించింది.

- దేశంలో 270కిపైగా పీఎస్‌యూలు
- మోదీ సర్కారు హయాంలో పీఎస్‌యూ వాటాల విక్రయం ద్వారా సమీకరించినది దాదాపు రూ.5 లక్షల కోట్లు
- 2014 నుంచి ఒక్క ప్రభుత్వ రంగ సంస్థనూ ఏర్పాటుచేయని కేంద్రం
- గడిచిన 9 ఏండ్లలో 23 ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ
- రోడ్డునపడ్డ 2.7 లక్షల మంది ఉద్యోగులు

**ఖజానాకు పీఎస్‌యూల కష్టార్జితం**

గత ఆర్థిక సంవత్సరానికి (2022–23)గాను ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల నుంచి కేంద్ర ప్రభుత్వం రికార్డుస్థాయిలో డివిడెండ్‌ను పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టాక్ మార్కెట్లలో నమోదైన 67 పీఎస్‌యూల నుంచి రూ.63,056 కోట్ల ఈక్విటీ డివిడెండ్‌ను కేంద్రం అందుకోవచ్చంటున్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2021–22)తో పోల్చితే ఇది 24.7 శాతం అధికం. నాడు రూ.50,583 కోట్ల డివిడెండ్ పీఎస్‌యూల నుంచి ఖజానాకు చేరింది. ఇక 2018–19లో రూ.29,049 కోట్లే రాగా, దీంతో పోల్చితే వస్తున్నది రెట్టింపునకుపైగా ఉంటుండటం గమనార్హం. నిజానికి 2022–23కుగాను కేంద్ర ప్రభుత్వానికి పీఎస్‌యూల నుంచి అందే డివిడెండ్ ఇంకా పెరగొచ్చన్న అంచనాలున్నాయి. గెయిల్, హిందుస్థాన్ కాపర్ తదితర ప్రభుత్వ రంగ కంపెనీలు ఇప్పటికీ తమ తుది ఈక్విటీ డివిడెండ్‌ను ప్రకటించలేదు. ప్రకటిస్తే రూ.63,056 కోట్ల కంటే చాలా ఎక్కువ మొత్తంలోనే డివిడెండ్ కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరనున్నది. ఇక కేంద్రానికి డివిడెండ్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల వాటానే ఎక్కువగా తేలుతున్నది. గత ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.18,000 కోట్లు రావచ్చని అంటున్నారు.

**మోదీ హయాంలో పీఎస్‌యూల్లో పెట్టుబడుల ఉపసంహరణ (రూ.కోట్లలో)**

| ఆర్థిక సంవత్సరం | సమీకరించినది |
|---|---|
| 2014-15 | 24,349 |
| 2015-16 | 23,997 |
| 2016-17 | 47,742 |
| 2017-18 | 1,00,057 |
| 2018-19 | 94,727 |
| 2019-20 | 50,304 |
| 2020-21 | 32,886 |
| 2021-22 | 13,561 |
| **2022-23** | **87,771** |

- 2022–23కుగాను కోల్ ఇండియా, ఓఎన్జీసీ, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్ప్ వంటి పీఎస్‌యూల నుంచి కేంద్రానికి రూ.45వేల కోట్ల డివిడెండ్ వస్తుందని అంచనా
- గత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వానికి పీఎస్‌యూలిచ్చే డివిడెండ్లలో కోల్ ఇండియాదే గరిష్ఠం. రూ.13,550.7 కోట్లుగా ఉంటున్నది
- ఓఎన్జీసీ నుంచి మొత్తం రూ.8,335 కోట్లు వస్తుండగా, ఎస్బీఐ ఇప్పటికే రూ.5,740 కోట్ల డివిడెండ్ చెల్లించింది
- రిజర్వ్ బ్యాంక్ కూడా 2022–23కుగాను కేంద్ర ప్రభుత్వానికి రూ.87,416 కోట్ల మిగులు నిల్వలను డివిడెండ్‌గా అందించాలని గత నెల నిర్ణయించింది

**తెలంగాణపై కేంద్రం గురి**

మొదట్నుంచి తెలంగాణ అంటే గిట్టని నరేంద్ర మోదీ సర్కారు.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మేందుకు ప్రయత్నిస్తున్నది. అయితే దీన్ని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగానే అడ్డుకుంటున్నది. వివిధ పీఎస్‌యూలకు చెందిన రూ.40,000 కోట్ల విలువైన ఆస్తులను కేంద్రం అమ్మబోతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఇప్పటికే ధ్వజమెత్తిన విషయం తెలిసిందే. ఇది సరికాదని, దీనిపై పునరాలోచించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ కూడా రాసినది విదితమే. అయినప్పటికీ తీరు మారని కేంద్రం.. అమ్మేందుకే ముందుకెళ్తున్నది.

**అమ్మకానికి సిద్ధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో..**

- షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
- ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్
- బీఈఎంఎల్
- హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్
- కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
- వైజాగ్ స్టీల్
- ఐడీబీఐ బ్యాంక్

*-బిజినెస్ డెస్క్*

## పాదరక్షలకు నాణ్యత తప్పనిసరి

న్యూఢిల్లీ, జూన్ 19: వచ్చేనెల 1 నుంచి పాదరక్షలకు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి కానున్నాయి. చైనా తదితర దేశాల నుంచి భారత్‌లోకి దిగుమతి అవుతున్న నాసిరకం, తక్కువ నాణ్యత కలిగిన పాదరక్షలకు చెక్ పెట్టేందుకే ఈ కఠిన ప్రమాణాలను తీసుకువస్తున్నట్టు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ ఇక్కడ మీడియాకు తెలిపారు.

## మోసపూరిత ఖాతాల ప్రకటనపై బ్యాంకర్లకు ఎదురుదెబ్బ

### ఆర్బీఐ మాస్టర్ సర్క్యులర్లపై బాంబే హైకోర్టు స్టే

ముంబై, జూన్ 19: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్లపై బాంబే హైకోర్టు సోమవారం మధ్యంతర స్టే విధించింది. దీంతో ఎటువంటి విచారణ లేకుండానే ఇకపై బ్యాంకులు ఏ ఖాతానూ మోసపూరిత ఖాతా అని ప్రకటించకుండా అడ్డుకున్నట్టైంది. జెట్ ఎయిర్‌వేస్ మునుపటి ప్రమోటర్లు నరేశ్ గోయల్, ఆయన భార్య అనితా గోయల్‌సహా మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ గౌతమ్ పటేల్, జస్టిస్ నీలా గోఖలేతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే పైవిధంగా స్టే ఇచ్చింది. సెప్టెంబర్ 11దాకా ఇది వర్తిస్తుందన్నది. ఆర్బీఐ మాస్టర్ సర్క్యులర్లు అన్యాయంగా ఉన్నాయని, ఏ ప్రాతిపదికన రుణగ్రహీతల ఖాతాలను బ్యాంకులు మోసపూరిత ఖాతాలుగా తేల్చుతున్నాయని పిటిషనర్లు ప్రశ్నించారు. కాగా, సెప్టెంబర్ 7,8 తేదీల్లో ఈ కేసు మళ్లీ విచారణకు రానున్నది.

## ఐఐటీతో లారస్ జట్టు

న్యూఢిల్లీ, జూన్ 19: ఐఐటీ కాన్పూర్‌తో లారస్ ల్యాబ్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నది. నావల్ జీన్ థెరపీ అసెట్స్‌ను మార్కెట్‌లోకి తీసుకురావడానికే ఒప్పందం చేసుకున్నట్టు సోమవారం లారస్ తెలియజేసింది. ఇందులో భాగంగా ప్రీ–క్లినికల్ డెవలప్‌మెంట్ ద్వారా ఈ ఉత్పత్తుల అడ్వాన్సింగ్ కోసం లారస్ ల్యాబ్స్ ఐఐటీ కాన్పూర్‌కు రిసెర్చ్ గ్రాంట్లను అందించనున్నది.

# పోరాట ఘట్టాల్లో 'దేవర'



**ఎన్టీఆర్** కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. బాలీవుడ్ అగ్ర హీరో సైఫ్‌అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం హైదరాబాద్‌లో తీర్చిదిద్దుతున్న భారీ సెట్‌లో పోరాట ఘట్టాలను తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్–సైఫ్‌అలీఖాన్ మధ్య వచ్చే ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ఎన్టీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఈ సినిమాపై అంచనాల్ని పెంచింది. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంత నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మృగాల్లాంటి మనుషుల బారి నుంచి తన వారిని రక్షించుకునే ధీరోదాత్తుడైన వ్యక్తిగా ఎన్టీఆర్ పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని సమాచారం. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.




# పోలీస్ రక్షణ కోరిన 'ఆదిపురుష్' రచయిత

ప్రభాస్ కథానాయకుడిగా ఓంరౌత్ రూపొందించిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారతీయ పురాణేతిహాసం రామాయణాన్ని వక్రీకరించారని, హనుమాన్ పాత్రధారి చెప్పిన సంభాషణలు ఆ పాత్ర ఔచిత్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంభాషణల్లో మార్పులు చేస్తామని చిత్ర రచయిత మనోజ్ ముంతాషిర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విషయంలో తనకు వరుసగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ప్రాణహాని ఉన్నందున తగిన రక్షణ కల్పించాలని రచయిత మనోజ్ ముంతాషిర్ ముంబయి పోలీసులను ఆశ్రయించారు. త్వరలో డైలాగ్స్‌ను మార్చబోతున్నామని చెప్పినా వివాదం సద్దుమణిగేలా కనిపించడం లేదని రచయిత మనోజ్ ముంతాషిర్ పోలీసులకు వివరించినట్లు తెలిసింది. ఈ వివాదం ముగిసేవరకు రచయిత మనోజ్ ముంతాషిర్‌కు రక్షణ కల్పిస్తామని ముంబయి పోలీసులు హామీ ఇచ్చారని సమాచారం.

# తెలుగు సినిమా నా పుట్టినిల్లు


కాజల్ అగర్వాల్

**అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్** నటిస్తున్న తాజా చిత్రానికి 'సత్యభామ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అఖిల్ డేగల దర్శకుడు. ఆరమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కళపల్లి నిర్మిస్తున్నారు. మహిళా ప్రధాన ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదివారం కాజల్ పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ''మగధీర'లో మిత్రవిందగా కాజల్ అందరికి గుర్తుండిపోయింది. ఇప్పుడు కూడా అదే అందంతో అలరిస్తున్నది. పెళ్లయినా సరే కథానాయికలు తమ కెరీర్‌ను కొనసాగించాలి అనేందుకు కాజల్ మంచి ఉదాహరణ' అని అన్నారు. ఈ సినిమాలో సత్యభామగా కాజల్ పాత్ర చిత్రణ కొత్త పంథాలో ఉంటుందని దర్శకుడు తెలిపారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ 'తెలుగు సినిమా నాకు పుట్టినిల్లు. కాస్త విరామం తర్వాత మళ్లీ తెలుగు సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. 'సత్యభామ' అందరూ గుర్తుంచుకునే మంచి సినిమా అవుతుంది' అని చెప్పింది.

## చిత్రం


రామజోగయ్య శాస్త్రి, విక్రమ్, వివేక్ కూచిభొట్ల, శశిధర్ రెడ్డి తదితరులు

# వసూళ్లలో రికార్డులు సృష్టిస్తున్నది

**ప్రభాస్** కథానాయకుడిగా ఓంరౌత్ దర్శకత్వంలో రూపొందిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం 'రామజయం రఘు రామ జయం' పేరుతో సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఇలాంటి ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని మా సంస్థ ద్వారా విడుదల చేయడం ఆనందంగా ఉంది. నైజాంలో దాదాపు 500 స్క్రీన్లలో విడుదల చేయగా..తొలిరోజు 13.65 కోట్ల వసూళ్లు వచ్చాయి. స్టార్ హీరో చిత్రానికి ఇదొక రికార్డు. రెండో రోజు ఎనిమిది కోట్ల వసూళ్లు సాధించింది. కలెక్షన్స్ స్థిరంగా కొనసాగుతున్నాయి' అన్నారు. యుగాలు, తరాలు మారినా రామ కథ గొప్పతనం అలాగే ఉంటుందని, భక్తిభావంతో ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తున్నారని మాటల రచయిత భీమ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సినిమాలో అన్ని పాటలను తానే రాశానని, చక్కటి భావోద్వేగాలతో సినిమా ఆకట్టుకుంటున్నదని గీత రచయిత రామజోగయ్యశాస్త్రి తెలిపారు. సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల మట్లాడుతూ 'రామనామాన్ని ప్రతీ గడపకు చేర్చాలనే ప్రయత్నంలో మేము సఫలీకృతులమయ్యాం. మూడు రోజులుగా వచ్చిన కలెక్షన్స్ రికార్డులు సృష్టిస్తున్నాయి. మన పౌరాణిక పురుషుల గురించి ఈ తరం పిల్లలు తెలుసుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా కోటి మంది ప్రేక్షకులు ఈ సినిమా చూశారు' అన్నారు.


అవికా గోర్

# భయపడుతూ చూస్తాను

'మహేష్‌భట్, విక్రమ్‌భట్ లాంటి గొప్ప ఫిల్మ్‌మేకర్స్‌తో కలిసి పనిచేయాలన్నది నా కల. '1920' చిత్రంతో ఆ కోరిక తీరింది. ఇంత త్వరగా ఇలాంటి అవకాశం రావడం నా అదృష్టం' అంటున్నది అవికాగోర్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం '1920'. కృష్ణభట్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా అవికాగోర్ మాట్లాడుతూ 'నేను హారర్ సినిమాల్ని ఇష్టపడతాను. భయపడుతూనే 'రాజుగారి గది' సినిమా చూశా. కానీ '1920' సీరియస్ హారర్ ఫిల్మ్. ఇలాంటి హారర్ సినిమా చేయడం నాకు తొలిసారి. చాలా కొత్త అనుభూతినిచ్చింది. ఈ సినిమా తరువాత నాకు మరిన్ని హారర్ సినిమాల్లో అవకాశాలు వస్తాయని అనుకుంటున్నాను' అన్నారు.

# రజనీకాంత్ చిత్రంలో యష్



'కేజీఎఫ్' సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలతో దేశవ్యాప్తంగా తిరుగులేని పాపులారిటీని సంపాదించుకున్నారు కన్నడ హీరో యష్. ఆయన తన తదుపరి చిత్రాన్ని మహిళా దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా తాజా సమాచారం ప్రకారం సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రంలో యష్ అతిథి పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. వివరాల్లోకి వెళితే... లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ తన 171వ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో ప్రతినాయక ఛాయలుండే అతిథి పాత్రలో యష్ నటించబోతున్నారని సమాచారం. లోకేష్ కనకరాజ్ డైరెక్ట్ చేసిన 'విక్రమ్' చిత్రంలో సూర్య మాఫియా డాన్ రోలెక్స్ పాత్రలో మెప్పించిన విషయం తెలిసిందే. అదే తరహాలో రజనీకాంత్ చిత్రంలో యష్ పాత్ర ఉంటుందని సమాచారం. లోకేష్ కనకరాజ్ ప్రస్తుతం విజయ్‌తో 'లియో' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ అనంతరం రజనీకాంత్ చిత్రాన్ని పట్టాలెక్కిస్తారు.


అలియాభట్, రణ్‌వీర్‌సింగ్

# రాఖీ..రాణి ప్రేమకథ

రణ్‌వీర్‌సింగ్, అలియాభట్ జంటగా కరణ్‌జోహార్ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'రాఖీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ'. జూలై 28న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దాదాపు ఆరేండ్ల విరామం తర్వాత కరణ్‌జోహార్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం..'గల్లీబాయ్' చిత్రం తర్వాత రణ్‌వీర్–అలియా జోడీ నటించిన చిత్రమిదే కావడంతో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా సోమవారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. చక్కటి ప్రేమకథ, ఫ్యామిలీ ఎమోషన్స్ కలబోతగా తనదైన శైలి మేకింగ్‌తో కరణ్‌జోహార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారని అంటున్నారు. 'ఓ హృద్యమైన ప్రేమకథను ఆస్వాదించడానికి అందరూ సిద్ధంగా ఉండండి' అంటూ కరణ్‌జోహార్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ సినిమాపై స్పందించారు.